లేతమొలకలు

మబ్బుల గొంగళిని వొకింత ప్రక్కకి వత్తిగిలించి చూచి, 'అరే చాలా ప్రొద్దెక్కిందే!' అనుకుంటూ సూర్యుడు బద్ధకంగా వళ్లు విరుచుకున్నాడు.

ఎండ చురుక్కుమనేసరికి నరిసిమ్మకు గబుక్కున మెలకువ వచ్చింది. ఆవలిస్తూ నులకమంచం దిగాడు. బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు.

బయటికి వచ్చి గుడిశముందున్న మొండి గోడమీద కూర్చుంటూ, "ఓలప్ప, కూసిని టీ నీళ్ళు పెట్టే!" అన్నాడు.

తుమ్మచెట్టు క్రింద బొచ్చెలు తోముకుంటున్న రావులమ్మ, "ఇదేవన్నా మీ బెజాడనుకున్నావా? మాం టీలూ, కాపీలూ ఎట్టుకోవూ, తాగమూ!" అంది నిర్మొగమాటంగా.

"ఓలబ్బ గొప్పేలేవే! నాను నీ తోడబుట్టినోడ్నీ, సుట్టపోడ్నీ గందే! అప్పను సూడాలని బెజాడ నుంచి వచ్చాగందా, కూత్తంత మరేద సెయ్యడం లేదా?" దర్జాగా కాలువూగిస్తూ అన్నాడు.

"మాలావు సుట్టం వచ్చావులేగాని, ఒకేసారి వన్నం వండుతా, తిని బేగి బస్సెక్కి ఎల్లిపో!" అని విసుక్కుంది.

"మొత్తానికే మోసంగా వుందే!" అని గొణుక్కుంటూ వీధిలోకి వచ్చాడు.

టీ నీళ్ళకోసం వూరికే నాలిక పీకుతూంది, ఏటి సెయ్యటమా? అని బుర్ర గోక్కుంటుంటే వాళ్ళ సీతాలప్ప గుర్తుకు వచ్చింది. సీతాలప్ప వాళ్ల చిన్నాయన కూతురు.

అక్కడ్నుంచి నేరుగా సీతాలప్ప గుడిసె కేసి వెళ్లాడు.

నరిసిమ్మను చూచి, "బత్తీ నుండెప్పుడు వచ్చావురా నర్సిమ్మా? బత్తీలో ఏం సేత్తున్నావు ఏందీ కతా?" అని ఆప్యాయంగా పలకరించింది.

"ఆకతంతా సెప్పాలంటే శానా వుంది గాని, బావయ్య ఏడీ కానరాటం లేదే?" అన్నాడు.

"కామందోరు కాడకు పొయ్యాడ్లేగాని కూకో!" అంటూ కుక్కి నులకమంచం వాల్చింది.

అటూ ఇటూ చూస్తూ యికిలిస్తూ సకిలిస్తూ, "సీతాలప్ప, బత్తీ తమ్ముడుకి టీ నీళ్లూ, కాఫీ నీళ్ళు ఏవీ లేవా?" అన్నాడు.

"ఏదో గంజినీళ్ళు తాగోళ్ళం! ఆ టీలూ, కాఫీలూ మాకేం తెలుత్తాయిరా తమ్ముడూ? అస్సలయ్యి ఎట్టా ఎట్టుతారో కూడా తెల్దే మాకు?" అమాయకంగా అంది.

"ఓ అదా, ఎట్టా ఎట్టాలో నేసూపిత్తాలేగాని ముందు టీ పొడి గట్రా తెప్పించు!" అన్నాడు.

అంతలోకే సీతాలు ఏడేళ్ళ కొడుకు కొండడు ముంజికాయ చిప్పలతో తయార్జేసిన బండీని తాడుతో లాక్కుంటూ, క్రిందకు జారిపోతున్న చెడ్డీని మాటిమాటికి పైకి లాక్కుంటూ వచ్చాడు.

క్రొత్త మనిషిని చూచినిలబడిపోయాడు. గడ్డం క్రింద చెయ్యి వేసుకుని నరిసిమ్మ వంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

"వీడెవ్వడే సీతాలప్పా?"

"నీవెవరూ?" అని ఎదురు ప్రశ్న వేశాడు కొండడు.

"మా పోరడు. మాకుంది వీడొక్కడే!" అంది మురిపెంగా కొడుకు వంక చూస్తూ.

"వీడ్ని సూడంగానే అనుకున్నా వీడు మా మేనల్లుడని. నీ పేరేంట్రా అల్లుడూ?" నవ్వుతూ అన్నాడు.

"కొండడు. మరి నీ పేరేంటి?" అన్నాడు.

"ఓర్నీయమ్మ, ఈడు పెళ్ళికి పెళ్ళేత్తున్నాడే? ఓస్సప్పో, నీ కొడుకు గట్టోడేనే!" అన్నాడు.

సీతాలు కొడుకును దగ్గరకు తీసుకొని ప్రేమగా తల నిమురుతూ చిన్నగా నవ్వింది.

"అల్లుడూ నీకు కోవటి కొట్టు తెల్సుంటరా?"

"బంగారుప్పొన్ను బంగారయ్య కొట్టు నాకెరికే!"

"ఓలప్పో! ఈడు శానా వుశేరుగా వున్నాడే! మీ అమ్మకాడ డబ్బులు దీస్కొని ఆ బంగారప్పొన్నోడి కొట్టుకెళ్ళి ఒక టీపొట్లాం, సెటాకు పంచదారా - పంచదార లేకపోతే గింత బెల్లం గడ్డా తీసుకురా! ఆ సేత్తోనే సిన్న గలాసుడు పాలు కూడా పట్రా! ఇయ్యాళ మనం బెమ్మాండంగా టీ సేద్దారి, బేగెళ్ళిరా!" అని వుషారు చేశాడు.

కొండడు వాళ్లమ్మకాడ డబ్బులు అడిగి పుచ్చుకొన్నాడు. చిన్న కార్ను స్టార్టు చేస్తోన్నట్టు ఎడం చేత్తో ముందుకూ వెనక్కీ జరిపి కుడి చేత్తో హారన్ మ్రోగిస్తున్నట్టు 'పాయ్ పాయ్' అని అరుస్తూ నోటితో వింత వింత శబ్దాలు చేస్తూ వుషారుగా లగెత్తాడు.

"అరేయ్ అల్లుడూ, ఆ సేత్తోనే నాకు బీడీ కట్ట కూడా పట్రా!" వెనక నుంచి కేక పెట్టాడు.

ఇంతలో సీతాలు పొయ్యి రాజేసింది.

ఆపాటికి కొండడు కోవటి కొట్టుకాడ్నుంచి సరుకులన్నీ తెచ్చాడు.

..... నరిసిమ్మ ప్రక్కన కూర్చొని సూచనలిస్తుండగా ఒక పెద్ద గిన్నెడు టీ తయారైంది.

నరిసిమ్మ ఆబగా టీ త్రాగుతూ కబుర్లు చెప్పసాగాడు. కొండడు గొంతుక్కూర్చుని చొక్కాతో టీ గ్లాసు పట్టుకొని నోటితో 'వుఫ్ వుఫ్' మని ఊదుకుంటూ త్రాగుతున్నాడు.

వాడ్ని చూచినవ్వుతూ "సీతాలప్పా, నీ కొడుకు సేకులాగా వున్నాడు. ఈడ్ని బళ్ళోకంపడం లేదా?' అన్నాడు.

ఆ గూడంలో కాదు గదా, అస్సలా పల్లెలోనే బడి లేదు. బడి కెళ్ళాలంటే ఆరు మైళ్ళవతల వున్న

'కొత్తవూరు' వెళ్లాలి. కొండడే కాదు, ఆ గూడెంలో ఎవరి పిల్లలూ చదువుకోవటం లేదు. ఆ గూడేన్ని ఆ సరస్వతీదేవి కూడా వెలివేసింది!

కొండడి ఈడు పిల్లలందరూ బర్రెల్ని కాస్తారు. కొండడు కూడా వాళ్లయ్య పన్జేసే కామందుగారి గొడ్లను రోజూ అడవికి తోలుకుపోయి సాయంకాలం వరకు మేపి, సాయంత్రం వాట్ని చెర్వులో బాగా తోమి కడిగి తీసుకు వస్తాడు. అదే వాడి దినచర్య! చదువూ చట్టుబండలూ లేవు!

"సేకులాంటోడ్ని సదువూ సందల్లేకుండా బర్రెగొడ్డుల్ని కాపిస్తున్నావా సీతాలప్పా! ఈడ్ని నావెంట బస్తీకి పంపు. బస్తీలో బెమ్మాండంగా సదివిత్తా! ఏరా, నా ఎంట బత్తీకొచ్చి ఆడ సదువుకుంటావా అల్లుడూ?" అని అడిగేడు.

కొండడు వుషారుగా "ఓ" అన్నాడు.

"అమ్మా, నానూ బత్తీ బళ్ళో సదుకుంటానే!" అని వాళ్ళమ్మ దగ్గర మారాం మొదలు పెట్టాడు.

"మనకెందుకురా కొండా ఈ సదువులు?" నిర్లిప్తంగా అంది.

"ఏంటప్పా అట్టాగంటావు? పేదలో పుట్టామని బతికినంతకాలం మనం, మన పిల్లలూ, ఆళ్ళ పిల్లలూ - ఈ పేడే పిసుక్కుంటూ ఆ బర్రెల్నే కడుక్కుంటూ ఆ పేద బతుకులే బతకాలా? నేను బెజాడలో సూత్తున్నానుగా! ఆడ పిల్లలందరూ సదువుకునేవాళ్లు గాని సదువుకోనోల్లు ఎవళ్ళూ వుండరూ! నామాట విని కొండడ్ని కూడా బత్తీకి పంపించి సదివించు. అందరిమల్లే ఆడూ సదువుకుంటాడు. పెద్ద ఆఫీసరు అవుతాడు..."

నరిసిమ్మ ఇలా చెప్పుతుంటే సీతాలు ఎక్కడో ఆలోచిస్తోంది.

కొండడు మళ్ళీ, "అమ్మా ఓలమ్మా! నానూ సదువుకుంటానే!" అని గొడవ చేయసాగాడు.

"మీ అమ్మ అట్టాగే అంటుంది గానీ నువ్ నాతో వచ్చేయరా కొండా!"

"నే వెళ్తా! నే వెళ్తా!" కాళ్ళూ చేతులూ రపరపా కొట్టుకుంటూ గొడవ చేయసాగాడు.

"ఓరుండరా అట్టాగే ఎల్దువుగాని! నరిసిమ్మా, నాకు తెలియక అడుగుతా గానీ బత్తీలో ఈడేడ వుంటాడు? ఏడ తింటాడు? ఆ కర్సు మన కలిమయ్యేదేనా?" బోలెడు అమాయకంగా అడిగింది.

"ఓస్సదా నీ సంకోసం? ఇదివరకు మల్లే కాదప్పా! గవర్నమెంటోళ్లు మనలాంటోళ్ళు పిల్లలు సదుకుంటానికీ బత్తీలో హాట్టళ్ళు పెట్టించారు. రెండుపూటలా తింటానికి కూడా, సదుకోటానికి పుత్తకాలూ, కట్టటానికి బట్టా, కాక పై కర్సులకు నెలనెలా ఇంతని డబ్బా అన్నీ ఆళ్లే యిత్తారు."

"ఎట్టా?" నోటిమీద వేలువేసుకుని ఆశ్చర్యంగా అంది.

"అవునే అప్పా! మన సేతికర్సు పైసా కూడా పెట్టక్కర్లేదు. కొండడ్ని నాతో పంపిత్తే సాలు. పెద్ద పెద్ద సదువులు సదివి సూటూ, బూటూ వేసుకొని మళ్ళీ ఆడు దొరబాబు లాగా తిరిగి వత్తాడు. గంతే!'

"సర్లేరా, ఆళ్ళయ్యను కూడా కనుక్కొని అట్టాగే పంపిత్తా!"

"అయ్య వద్దంటాడే! అయ్యకి నీవ్వే సెప్పే! ఓలమ్మా నన్నంపే, బత్తీలో సక్కగా సదువుకుంటానే!' ' అంటూ వాళ్లమ్మ భుజం మీద వాలి మారాం మొదలుపెట్టాడు.

"ఓరట్టాగా ఎల్దువుగాన్లేరా!" అంటూ కొడుకును వళ్లోకి లాక్కొని ప్రేమగా ముద్దుపెట్టుకుంది.

"ఇయ్యాళ సాయంకాలం బస్సుకే నే వెల్లిపోతున్నా సీతాలప్పా! ఈ లోపల బావయ్యతో సెప్పి బుడ్డోడ్ని రెడీ సెయ్యి! మర్నేవొత్తా! వొత్తారా అల్లుడూ, నువు లెడీగా వుండు!" అని నరిసిమ్మ వెళ్ళిపోయాడు.

వళ్లో పడుకున్న కొడుకు తన చిన్న చేతుల్తో తన గడ్డం పట్టుకొని "అమ్మా, నే వెళ్తానే! నన్నంపే!" అని బ్రతిమాలుతుంటే సీతాలు ఆలోచనలోపడింది.

అప్పుడెప్పుడో చానేళ్ళ క్రింద పోలేరమ్మ జాతరకు కొత్త వూరెళ్ళినప్పుడు అక్కడ డేరా హాల్లో ఒక సిన్మా చూచింది. ఆ సినిమాలో కూడా పాలేరుతనం చేసే చిన్న కుర్రాడు బస్తీకెళ్ళి చదువుకుంటాడు. తెల్లటి బట్టలు వేసుకొని సంచి భుజానేసుకొని బూట్లేసుకొని బడికెళ్లుతాడు. మళ్ళీ అంతలోనే పెద్దోడు అయిపోతాడు. సూటూబూటూ వేసుకుంటాడు. పెద్ద ఆఫీసరయిపోతాడు. కొడుకుని చూచుకొని వాళ్ళమ్మ ఎంతో సంబరపడిపోతుంది. తన జన్మ ధన్యమైపోయినట్లు పొంగిపోతుంది - 'అమ్మా!' అంటూ తల్లిని కౌగలించుకుంటాడు. ఆ సిన్మ చూస్తున్నప్పుడు అనుకుంది. తనకు పుట్టే కొడుకును కూడా అలా చదివించి గొప్పోడ్ని చెయ్యాలని. ఆ తర్వాత ఆ సంగతే మర్చిపోయింది. మళ్లీ ఈరోజు ఈ నరిసిమ్మా వచ్చిచెప్పాక ఆ పాత 'వూసు' మళ్ళీ యిప్పుడు గుర్తుకు వచ్చింది. ఆ పాతకోర్కె మళ్ళీ తన గుండెల్లో జవజవలాడింది.

..... బ్రతిమాలీ, బామాలీ, తగువులాడి ఎలాగైతేనేం మొగుడ్ని వప్పించి ఆ సాయంకాలమే కొండడ్ని నరిసిమ్మ వెంట బస్తీకి పంపించింది. విడిగా మరో చొక్కా లాగూ ఒక తుండుగుడ్డలో మూటగట్టి కొడుకు చేతికి ఇచ్చింది. మొన్న తొలి ఏకాదశికి కొట్టిన పేలపిండిని ఒక కాగితంలో పొట్లం కట్టి 'ఆడ తినరా కొండా!' అని ఆ మూటలో పెట్టింది.

కొండడి తండ్రి బిచ్చాలు షావుకారుకాడ అప్పుచేసి బస్సుచార్జీలకూ, దారి ఖర్చులకూ ముప్పై రూపాయలు నరిసిమ్మ చేతిలో పెట్టాడు.

బస్సెక్కపోయే ముందు సీతాలు కొడుకును ప్రేమగా దగ్గరికి తీసికొని బుగ్గలు పుణికి "అయ్యా కొండా, నీవు బత్తీలో బాగా సదుకొని దొరబాబులాగా తిర్గి రావాలిరా అయ్యా!" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

తన చిన్న చేతుల్తో తల్లి కన్నీళ్ళు తుడుస్తూ "అట్టాగేలేవే, నీవు ఏడమ్మాకే" అన్నాడు.

* * *

బస్సు వేగంగా పోతూంది.

కొండడు బస్సులో కిటికీ పక్క కూర్చున్నాడు. ఇళ్ళకు తిరిగిపోతున్న గేదెలూ ఆ గేదెల్ని కాసే బుడ్డోళ్ళూ, తోటలూ, దొడ్లూ, తాడిచెట్లూ, చెర్వులూ, వాగులూ, వంకలూ ఒకదానివెంట ఒకటి వెనక్కి వెనక్కి పోతుంటే వేగంగా పోయే బస్సులోంచి ఆ దృశ్యాలన్నింటినీ చూడడం కొండడికి ఎంతో వింతగా, సరదాగా వుంది. అసలు బస్సెక్కటం వాడికదే మొదటిసారి. పక్కనున్న క్రొత్తవూళ్ళో జరిగే జాతర్లకు, సంతలకు అప్పుడప్పుడు తండ్రి వెంట వెళ్ళేవాడే గాని బస్సు మాత్రం ఎప్పుడూ ఎక్కలేదు. ఎప్పుడెళ్ళినా, ఎక్కడికెళ్ళినా వాళ్ళయ్య భుజాల మీదే కూర్చునేవాడు.

అమ్మకూ, అయ్యకూ పుట్టి పెరిగిన గూడెంకూ దూరంగా వెళ్ళిపోవడం బాధగా వున్నా - తాను బస్తీలో చదువుకోటానికి పోతున్నాననే సంతోషం ముందు ఈ బాధ పెద్ద దిగులు అనిపించలేదు. వాడి ధ్యాసంతా బడీ, పిల్లలూ, నల్లబోర్డు, బోలెడు పుస్తకాలూ, ఆ పుస్తకాలన్నీ తను చదవటం - వీటిమీదే వుంది!

చల్లగా వీస్తోన్న గాలికీ, బస్సు కుదుపుళ్ళకూ వాడికి తెలియకుండానే నిద్ర ముంచుకొచ్చింది.... మళ్ళీ మెలకువ వచ్చి బయటికి చూచేసరికి బాగా చీకటి పడిపోయింది. వీధి దీపాలూ, బస్సులూ, బుడ్డకార్లూ, రిక్షాలూ, మనుషులూ, షాపులూ కనిపిస్తున్నాయి.

అంతలో బస్సు విజయవాడకు చేరుకుంది. ఒక సెంటర్లో ఆగింది. అక్కడ వాళ్ళు దిగారు.

నరిసిమ్మ మావ తన చెయ్యి పట్టుకుని బాగా రద్దీగా వున్న ఆ సెంటర్లో నడిపించుకుంటూ ఎక్కడికో తీసుకుపోతున్నాడు. బట్టలమూటను చంకలో పెట్టుకొని మరో చేత్తో మావయ్య చెయ్యి పట్టుకొని నడుస్తూంటే ఎన్నో దుకాణాలూ, కళ్ళు మిరుమిట్లు కొల్పే దీపాలూ, బస్సులూ, పెద్ద పెద్ద మేడలూ కనిపించాయి. వీటన్నింటినీ చూడ్డం తన కెంతో వింతగా, చోద్యంగా వుంది.

తను వూరికే దిక్కులు చూస్తోంటే!, "ఒరరయ్, నడువురోయ్!" అన్నాడు మావ.

ఆ బజార్లగుండా నడిచి నడిచి రైలుకట్టకేసి వచ్చారు. రైలు పట్టాలూ, పచ్చగా ఎర్రగా వున్న దీపాలు కనిపిస్తోన్నాయి. దూరంగా రైలు కూతలు వినిపిస్తోన్నాయి. ఇంతలో దడదడా శబ్దం చేసుకుంటూ ఒక రైలుబండి ఆ పట్టాల మీద యమ స్పీడుగా వెళ్ళిపోయింది. ఆ రైల్ను తను నోరెళ్లపెట్టుకుని చూస్తూ నిలబడ్డాడు.

తనని అలా నడిపించి నడిపించి ఒక కాలవ గట్టుకేసి తీసికెళ్ళాడు. అక్కడ చీకటిగా వుంది. తనకెందుకో భయమేసింది. అంతలో చిన్న గుడిశలు కనిపించావు. ఒక గుడిశ ముందు ఆగి, "మస్తాను వుండేదెక్కడ?" అని మావ వాకూబు చేశాడు.

ఇంకొంత దూరం నడిచాక ఒక గుడిశ ముందు ఆగారు. ఆ గుడిశ ముందేసిన నులక మంచం మీద ఒక మనిషి కూర్చుని మరో ఆడమనిషితో వూసులాడుతున్నాడు. అతను నరిశిమ్మ మామను చూచి "ఎవరది?" అంటూ లేచి వచ్చాడు. అతడు పొడుగు పంట్లాం, కురచ చేతుల రంగుల బన్నీనూ తొడుక్కున్నాడు. సిగరెట్టు త్రాగుతున్నాడు.

"నేనే మస్తానన్నా!" అంటూ మావ ముందు కెళ్ళాడు.

"నీవ్వా, ఏంటి పనిమీద వచ్చావు?" అన్నాడు.

"వూర్లోంచి మా వాళ్ళ బుడ్డోడ్ని తీసికొచ్చా!" అంటూ అతన్తో ఏదో మాట్లాడాడు.

తను ఆ ప్రక్కనున్న లైటు స్తంభం క్రింద ఒకదానిమీద ఒకటి పడుతూ లేస్తూ హుషారుగా గంతులేస్తోన్న రెండు కుక్కపిల్లల్ను సరదాగా చూస్తూ నిలబడ్డాడు.

ఆ మస్తాను తన దగ్గరకొచ్చి భుజం మీద వేశాడు. నవ్వుతూ, "నీ పేరేనా కొండడు?" అన్నాడు. అవునన్నట్లు తాను తల వూగించాడు.

"నిన్ను అయిదరాబాదుకు తీసికెళ్ళి అక్కడున్న గవర్నమెంటోళ్ళ హాట్టల్లో జేరిపిస్తా. మరి బాగా చదువుకుంటావా?" అన్నాడు.

తను వుషారుగా తల వూగించాడు.

నరిసిమ్మ ఆ రాత్రి కొండడ్ని హోటల్‌కి తీసికెళ్ళి భోజనం పెట్టించాడు. కుర్చీలో కూర్చొని టేబిల్ మీద స్టీలు కంచంలో భోంచెయ్యాలంటే కొండడికి మహా యిబ్బందయిపోయింది. కుక్కి మంచంలోనో, వాళ్ళమ్మ ఒడిలోనో, వాళ్ళ గుడిశ ముందున్న మొండి గోడమీదనో కూర్చొని సత్తుబొచ్చెల్లో ఏ గంజినీళ్ళో త్రాగి, ఏ సంకటి కూడో తినేవాడు. ఆ లైట్లూ, ఆ సర్వర్లూ, కంచంలో అన్ని రకాల కూరలూ చూస్తోంటే బెరుకుతో, సిగ్గుతో అన్నం సరిగ్గా తిన్లేకపోయాడు.

హోటల్లో భోంచేశాక రైల్వే స్టేషను కెళ్ళారు. స్టేషన్లో ఒక బెంచీ మీద పడుకున్నారు. తన గుడ్డల మూటని తలక్రింద పెట్టుకున్నాడు. వచ్చేపొయ్యే రైళ్ళ కూతలు వింటూ కళ్ళు మూసుకున్నాడు. వెంటనే నిద్రపట్టలేదు. తల్లి గుర్తుకు వచ్చింది. తల్లి మెడను వాటేసుకొని వెచ్చగా, హాయిగా పడుకోవటం గుర్తుకు వచ్చింది. కన్నీళ్ళు వుబికాయి. గొంతులో ఏడ్పు సుళ్ళు తిరిగింది.

హైదరాబాదులో తాను చదువుకోవాలనే బలమైన కోర్కె మళ్ళీ అంతలోకే ఆ కన్నీళ్ళనూ, ఆ ఏడ్పునూ అదిమేసింది. అక్కడ తాను చదవబోయే చదువు గురించి రకరకాలుగా ఆలోచించుకుంటూ మెల్లగా నిద్రలోకి జారిపోయాడు....

నర్సిమ్మ మావ మళ్ళీ చీకటితో లేపాడు. రైల్వే స్టేషను పంపు దగ్గర మొగాలు కడిగారు. మావ తనకు యిడ్డెన్లు పెట్టించాడు. కాఫీ యిప్పించాడు. ఇంతలోకి రాత్రి చూచిన మస్తాన్ వచ్చాడు. అతను భుజానికొక సంచి తగిలించుకున్నాడు.

దడదడా శబ్దం చేస్తూ రైలుబండి వచ్చి ఆగింది.

"అల్లుడూ, మన మత్తానన్న నిన్ను అయిదరాబాదులో హాట్టల్లో జేరిపిస్తాడు. బాగా చదువుకో!" అన్నాడు నరిసిమ్మ.

"నువు రావా?" దిగులుగా అన్నాడు.

"నేనెందుకురా, మన మత్తానన్న వున్నాడుగా! బెంగెట్టుకోమాకు. నేనప్పుడప్పుడు వచ్చి సూత్తుంటాలే!"

అంతలోకి రైలుబండి కదిలింది. మావ చెయ్యి వూపుతూంటే తనూ వూపాడు.

భయం భయంగా, బోలెడు మనాదిగా వుంది. మళ్ళీ అంతలోకే వుషారు తెచ్చుకున్నాడు...

ఎదురు సీట్లో యించుమించు తనీడువాళ్ళే యిద్దరు కుర్రాళ్ళు కూర్చున్నారు. వాళ్ళు చాలా మంచి బట్టలు వేసుకున్నారు. చొక్కాల్ని లాగుల్లోపల దోపి, పైన బెల్టులు పెట్టుకున్నారు. మేజోళ్ళూ, బూట్లూ వేసుకున్నారు. వాళ్ళిద్దరూ అన్నదమ్ముల్లాగా వున్నారు. వాళ్ళకు పరీక్షలయిపోయినట్లున్నాయి. వాళ్ళమ్మా నాన్నలతో కలసి శలవుల్లో హైదరాబాదు చూడడానికి వాళ్ళ బంధువులింటికి పోతున్నారు. ఆ పిల్లలు నవ్వుతూ త్రుళ్ళుతూ వూరికే కాళ్ళు వూగిస్తూ కామిక్స్ పుస్తకాలు చదువుకుంటున్నారు.

కొండడు ఆ యిద్దరు పిల్లల్నూ, వాళ్ళ చేతుల్లో వున్న పుస్తకాలనూ మార్చి మార్చి చూస్తూ ఏవేవో

వూహాలోకాల్లో విహరించసాగాడు.... తాను కూడా ఈ పిల్లల్లాగా బళ్లో బోలెడు చదువుకొని, బాగా పరీక్షలు వ్రాసి శలవుల్లో యింటికి వెళ్ళుతాడు. అమ్మ తనని చూడగానే, 'మా అయ్యే, నా కొండే!' అని ముద్దులాడుతుంది. అయ్య తనని వళ్ళో కూర్చోపెట్టుకొని, తాను బళ్ళో నేర్చుకున్న పాఠాల్ను చెప్పించుకొని, మురిసిపోతాడు...

ఇలా వూహల వుయ్యాల్లూగుతూ మెల్లగా చిన్న కునుకు తీశాడు.....

* * *

నాంపల్లి స్టేషన్లో దిగారు. రిక్షా ఎక్కారు. ఆ రిక్షా పెద్ద పెద్ద బజార్ల గుండా పోయీ, పోయీ చివరికి ఒక పెద్ద కాలనీలోకి మళ్ళింది. ఆ కాలనీలో అన్నీ పెద్ద పెద్ద భవంతులున్నాయి.

ఒక పెద్ద బంగళా ముందు రిక్షా ఆగింది. తనను బయట వరండా మెట్ల దగ్గిరనిలబెట్టి మస్తాను లోపలికెళ్ళాడు.

వరండాలో గొలుసుతో కట్టేసి వున్న కుక్క భౌ భౌమని అరుస్తూ తన మీదకు దూకబోయింది. తనకు భయంతో లాగు తడిసిపోయేంత పనయింది!

మరి కాసేపటికి మస్తాను బయటికి వచ్చాడు. తనని లోపలకి తీసికెళ్ళాడు.

ఒక లావుపాటాయన వాలుకుర్చీలో సుఖంగా కూర్చొని విశ్రాంతి తీసుకొంటున్నాడు. ఆ గదిలో చాలా చల్లగా, హాయిగా వుంది.

మస్తాను తనని ఆయనకు చూపించి, "వీడే సాబ్! నేను వూర్నుంచి తీసికొచ్చిన కుర్రాడు. కొండా, అయ్యగారికి దణ్ణం పెట్టు! అయ్యగారూ, అమ్మగారూ చెప్పినట్లు వినుకోవాలి, బాగా సదువుకోవాలి! నేనప్పుడప్పుడు వచ్చి చూచిపోతుంటాలే!" అన్నాడు.

మస్తాను ఆ సాబ్‌కు వంగి వంగి దణ్ణాలు పెట్టి వెళ్లిపోయాడు.

ఆయన కొండడ్ని నఖశిఖపర్యంతం పరీక్షగా చూశాడు.

"నీ పేరేంటిరా?" అని అడిగాడు. తను చెప్పాడు.

ఆయన మళ్ళీ, "కాంతమ్మా!" అని పిలిచారు. లోపల్నుంచి ఒకామె వచ్చింది. "పిలిచారా అయ్యగారూ?" నమ్రతగా అంది. హిందీలో ఆమెకేదో చెప్పారు.

కాంతమ్మ వాడ్ని లోపలికి తీసికెళ్ళింది. తన చిన్న బట్టల మూటను చంకలో పెట్టుకొని బితుకు బితుకుగా ఆమె వెనకాల వెళ్ళాడు. పెద్ద పెద్ద గదుల్లోంచి నడిపించుకొని ఒక దొడ్లోకి తీసికెళ్ళింది.

ఆ దొడ్డి ఈ చివర్నుంచి ఆ చివరి వరకు ఉంది. ఒక ప్రక్క వేపచెట్టు కూడా వుంది. దానికిందే పంపు వుంది. ఆమె తనని ఆ పంపు కింద స్నానం చెయ్యమంది. స్నానం చేసి వచ్చాక వెనుక వరండాలో అన్నం వడ్డించింది. నేలమీద కూర్చొని అన్నం తిన్నాడు. ఆయమ్మ మంచావిడ లాగే వుంది. కొసరి కొసరి వడ్డించింది. కడుపు నిండా అన్నం తిన్నాడు.

"ఆ పళ్ళెం గ్లాసు కడిగి అదిగో అక్కడ ఆ కిటికీలో పెట్టుకో!" అంది.

కంచం కడిగి ఆ కిటికీలో పెట్టాడు. తడిచేతులు లాగుకు పాముకున్నాడు.

దొడ్లో వేపచెట్టు గాలికి నిద్ర ముంచుకొచ్చింది. ఆ వరండాలోనే వత్తిగిల్లాడు. 'హాట్లల్లో మిగతా పిల్లోళ్ళు ఏడా కానరాటం లేదేంటి? అంతా బళ్ళల్లోకి పోయి వుంటార్లే! ఆటలవీ ఆడి మళ్ళీ సాయంకాలానికి పాలోమంటూ వత్తారు...' ఇలా అనుకుంటూ మెల్లిగా నిద్రలోకి జారిపోయాడు.

కాసేపు నిద్రపోయాడో లేదో కాంతమ్మ నిద్రలేపింది.

"నీపేరేంటి?'' అంది.

ఆట్టలు పుత్తకాల్లో రాసుకుంటారేమో అనుకుంటూ, "కొండడండీ! మా అయ్యపేరు బిచ్చాలు. మా అమ్మపేరు సీతాలండీ!'' అదేదో పాఠం లాగా అప్పజెప్పాడు.

ఆమె చిన్నగా నవ్వింది. తను సిగ్గుపడుతూ తల వంచుకున్నాడు.

"అదిగో ఆ పంపు కింద బొచ్చెలు వేశాను. అవన్నీ బాగా తోమి కడుక్కురా! అమ్మగారు నిద్దర లేస్తారు. ఆమెకు ఫలహారం తయార్జేసి ఛాయి పెట్టాలి!'' అంటూ హడావుడిగా లోపలికెళ్ళిపోయింది.

అటు చూశాడు, పంపుకింద బొచ్చలు గుట్టగా పడేసి వున్నాయి.

చదువు చెప్పే ఆట్టల్లో పిల్లలచేత బొచ్చెలూ బోళ్ళూ కూడా తోమిత్తారేమో అనుకున్నాడు...

'ఓ పిల్లోడా, యింకా మొదలుపెట్టలేదా? వాటితో నాకు చాల పనుంది. తొందరగా తోముకురా! ఆ గూట్లో డబ్బాలో పొడి వుంది. అదేసి తోము!'' లోపల్నుంచి కేకపెట్టింది.

ఆ కేకకు ఉలిక్కిపడ్డాడు. బొచ్చెలు తోమడానికి సిద్ధమయ్యాడు.

ఆ గుట్టలో ఎంగిలి కంచాలూ, గ్లాసులూ, గరిటలూ, ప్లేట్లూ, పెద్ద పెద్ద కూరగిన్నెలూ, డేగిశాలూ, నానా రకాల బొచ్చెలూ వున్నాయి. తనకయితే బర్రెగొడ్లను తోమి తోమి కడగటం వచ్చు గానీ ఈ బొచ్చెలూ బోళ్ళూ తోమటం రాదు. తన తల్లి తనచేత ఎప్పుడూ ఇలాటి పన్లు చేయించలేదు.

తల్లి బొచ్చెల్ని ఎలా కడిగేదో గుర్తుకు తెచ్చుకుంటూ తన చిన్న చేతుల్తో వాట్ని తోమే ప్రయత్నంలో వున్నాడు. మధ్యలో కాంతమ్మ వచ్చింది. "ఏరా, కొండయ్యా, నీకు బొచ్చెలు కడగడం రాదా?'' అంది. అవునన్నట్లు తల వూపాడు. పక్కన నిలబడి ఎలా తోమాలో సూచనలిస్తోంది.

ఇంతలో లోపల్నుంచి మరొకామె వచ్చింది. ఈమె ఖరీదైన చీరకట్టి, మనిషి డాబుగా, హుందాగా వుంది. 'అమ్మగారు' అంటే ఈమే కాబోలు!

అప్పటివరకు ఫ్యాను గాలి క్రిందా, మెత్తటి పరుపు మీదా సుఖంగా నిద్రపోయి వచ్చిందల్లే వుంది. మొహం వుబ్బి నిగారింపుగా వుంది.

ఆమె, "కాంతమ్మా, ఈ కుర్రాడు ఎలా పన్జేస్తోన్నాడు?'' అని అడిగింది. ఆమె గొంతు కూడా హుందాగా వుంది.

కొండడు తల ఎత్తి ఆమెను చూశాడు.

"కొత్త కదమ్మగారూ! దగ్గరుండి నేర్పిస్తే రెండు రోజుల్లో నేర్చుకుంటాడు'' అంది కాంతమ్మ.

ఆమె ఆ యింట్లో వంటావిడ, కొండడికి వాళ్ల మాటలు కొంచెం కూడా అర్థం కావటం లేదు. 'మరి అసలు సదువెప్పుడు నేర్పిత్తారో!'' అనుకున్నాడు.

"ఈ హైదరాబాదులో ఎంత డబ్బుపోసినా సరిగ్గా చేసే పనివాళ్లు దొరకటం లేదు. ఊరికే నాగాలు పెడతారు. ఒక్కొక్కళ్ళు నాలుగైదు ఇళ్ళు ఒప్పుకుంటారు. వీళ్ళతో పడలేకుండా వున్నామని అయ్యగారు వీడ్ని పల్లెటూర్నుంచి తెప్పించారు. మనింట్లోనే పర్మనెంట్‌గా పడి వుంటాడు. అన్ని పన్లూ చేస్తాడు...." అంది.

"మరేనమ్మగారు!"

".... వీడికి అన్నంపెట్టి, బట్టలిచ్చి, సంవత్సరానికి వెయ్యి రూపాయలు యివ్వాలంట...'

కొండడి చేతులు గిన్నెల్ని రుద్దడం ఆపేసాయి. ఎత్తిన తల అలాగే వుంది. బిత్తరపోయి చేష్టలుడిగి ఆ అమ్మగారి మాటలే వింటున్నాడు.....

"..... వీళ్ళ వాళ్ళకివ్వాలని, చార్జీలకనీ, దానికనీ దీనికనీ వీడ్ని తీసికొచ్చినవాడు అయ్యగారిదగ్గర ముందే రెండువేల దాకా తీసుకుపోయాడంట!..."

వేపచెట్టు మీది కాకులు గోలగోలగా అరవటం మొదలుపెట్టాయి.

'ఇదంతా దగా - పచ్చి మోసం - ద్రోహం -' అంటున్నాయా అన్నట్లు ఆ కాకులు ఆపకుండా గోలగా, వూరికే అరుస్తోన్నాయి!

మరి ఈ దగా ఎవరు చేశారు? ఈ పచ్చి మోసం ఎవరు చేశారు? ఈ ద్రోహం ఎవరు చేశారు?

నరిసిమ్మ మావ చేశాడా?

ఈ మస్తాను చేశాడా?

డబ్బులకాశపడి తన అయ్య చేశాడా?

డబ్బుకు కక్కుర్తిపడి తన తల్లే చేసిందా?

అంటరానివాడని కంటగించుకొని ఆ చదువుల తల్లి సరస్వతే చేసిందా?

కొండడి చిన్నారి మనస్సుకు ఇది అంతుపట్టని ప్రశ్నే! వాడి లేత వెన్నుకు ఇది పిడిబాకు పోటు!

కాకులింకా అరుస్తూనే వున్నాయి.....

- ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక
1990 దీపావళి ప్రత్యేక సంచిక

★